క్లుప్తంగా...

కూలిన ఇళ్లను పరిశీలించిన ఎంపీడీఓ



మల్కారంలో వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వసంతలక్ష్మీ

శంషాబాద్ రూరల్: పురాతన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ వసంతలక్ష్మీ సూచించారు. మండలంలోని మల్కారంలో వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోవడంతో గురువారం ఆమె పరిశీలించారు. కూలిన సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో నష్టం జరగలేదు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులోని జనాన్ని బయటకు తరలించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉషాకిరణ్, సర్పంచు మాధవి, నాయకులు యాదగిరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం



సమస్యలను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలో ప్రమాదభరితంగా మారిన రోడ్లు, డ్రైనేజీలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంకా రెండు రోజులు పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

కోకాపేట చెరువుకు గండి కొట్టిన అధికారులు



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్, అధికారులు

మణికొండ: బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కోకాపేట చెరువులోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. దాంతో చెరువు కట్ట తెగిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ బి. సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం చెరువును పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటం, వెనక నుంచి వరద నీరు ఎక్కువగా వచ్చి కట్ట తెగిపోతుందని స్థానికులు తెలపటంతో గురువారం ఓ చోట కట్టకు గండి కొట్టారు. దాంతో పైనుంచి వచ్చే నీరంత బయటకు వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారు.

వరద ప్రాంతాల్లో పోలీసు అధికారుల పర్యటన

శేరిలింగంపల్లి: వర్షాల నేపథ్యంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో సైబరాబాద్ పోలీసు అధికారుల బృందం గురువారం సాయంత్రం పర్యటించింది. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో మాదాపూర్ డీసీపీ సందీప్‌రావు, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐలు పాలవెల్లి, సంజయ్‌కుమార్, ఆర్‌సీపురం సీఐ పవన్ కుమార్, చందానగర్ డీఐ వెంకటేశం, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. లింగంపల్లిలోని గోపి చెరువు, నల్లగండ్ల చెరువులను పరిశీలించి చెరువుకట్టల పటిష్టత, నీటి నిల్వ, భారీ వర్షం పడితే నెలకొనే పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చే అవకాశం ఉంటే వెంటనే చెరువులోని కొంత నీటిని ఖాళీ చేయాలని సూచించారు. అనంతరం లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని సీపీ పరిశీలించారు. ప్రత్యామ్నాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగండ్లలో సెల్లార్ల తవ్వకాలతో అపార్ట్‌మెంట్ల ప్రహరీగోడలు కూలిన ప్రాంతాన్ని, డాక్టర్స్ కాలనీలో సఖి నిర్మాణ సంస్థ సెల్లార్ ప్రాంతాన్ని పక్కనే ఉన్న ఆభరణ అపార్ట్‌మెంట్‌ను, అందులోని వారు కొందరు ఇళ్ళను ఖాళీ చేసిన విషయాన్ని తెలుసుకున్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సీపీ అధికారులకు ఆదేశించారు.



పుప్పాలగూడలో కూల్చివేస్తున్న పాత ఇళ్లు



21 వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న కౌన్సిలర్ అజయ్

పండెన్‌వాగును పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తదితరులు



వాన బీభత్సం

శంషాబాద్: ఎడతెరిపి లేని భారీ వానతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుకుంటోంది. కాముని చెరువు నిండిపోయి పెద్ద ఎత్తున వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చేరుకుంటోంది. అదే విధంగా కాముని చెరువు వెనకాల ఉన్న ఎఫ్‌టీఎల్‌ను అనుకుని ఏర్పాటు చేసిన వెంచర్లు ఇప్పటికే నీట మునిగిపోయాయి. రైల్వేకమాన్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుకుంటోంది. పట్టణంలోని అహ్మద్‌నగర్‌లో ఉన్న శిథిలావస్థలో ఉన్న గృహం కూలిపోయింది. మరికొన్ని ఇళ్లు కూలే పరిస్థితుల్లో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న వరద పరిస్థితి మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. 21వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కౌన్సిలర్ అజయ్ పరిశీలించారు. వార్డు పరిధిలో బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి ప్రత్యామ్యాయ మార్గాలను సూచించారు.

పాత ఇల్లు కూల్చివేత

మణికొండ: నిరంతరాయంగా కురుస్తున్న వర్షానికి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పాత ఇంటిని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు సంతోష్‌నగర్ కాలనీలో గురువారం ఓ పురాతన ఇల్లు కూలిపోయేలా ఉందని తెలుసుకుని దాన్ని పూర్తిగా కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రవహిస్తున్న పండెన్ వాగులో చెత్తా చెదారం చేరి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో దాన్ని తొలగించారు.

పొంగి పొర్లుతున్న ఈసీవాగు

శంషాబాద్ రూరల్: భారీ వర్షాలకు ఈసీ వాగు పొంగి పొర్లుతోంది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులతో వాగులో భారీగా వరదనీరు ప్రవహిస్తుంది. కేబీ దొడ్డి సమీపంలో ఈసీవాగు వరదను చూసేందుకు జనం తరలివస్తున్నారు. పరివాహక ప్రాంతంలో స్థానికులు చేపల వేట కొనసాగిస్తున్నారు. మరోవైపు ఎంటేరువాగులో కూడా వరద ఉదృతంగా ప్రవహిస్తుంది.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జనం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఈసీ, ఎంటేరు వాగుల్లో వరదను ఆయన పరిశీలించారు. గ్రామస్తులు అవసరం ఉంటే తప్ప బయటకు రావద్దన్నారు. పిడుగుల పడే అవకాశం ఉండే చోటులో చెట్ల కింద నిలబడకుండా జాగ్రత పడాలన్నారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

రాజేంద్రనగర్: వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను, పొంగిపొర్లుతున్న నాలాలను ఆయన గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగు ఫీట్ల మేర నీరు పేరుకుపోవడంతో బస్తీ వాసులు భయాందోళనకు గురవుతూ, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పక్కనే ఉన్న చెరువులోని నీటిని నాలాల్లోకి మళ్లించారన్నారు. వరద నీరు విస్తృతంగా ప్రవహిస్తుండడంతో బస్తీ వాసులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీ సమస్యలపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి నాలాల్లో పేరుకుపోయిన చెత్తను దగ్గరుండి తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ముంపు కాలనీల పరిశీలన

మణికొండ: బుధవారం రాత్రంగా వర్షం కురవటం, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ముంపు కాలనీలను రాష్ట్ర మున్సిపల్ శాఖ, సీడీఎంఏ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి, వెంకటేశ్వరకాలనీలతోపాటు పండెన్ వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాగులో ఎలాంటి అడ్డు లేకుండా తొలగించి సాధ్యమైనంత వెడల్పు చేసి నీటి ప్రవాహం సునాయాసంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్‌లు, గృహాలలోకి నీరు వస్తే వారిని ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు.మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, కమీషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగవద్దు



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: భారీ వర్షాల దృష్ట్యా కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర అన్నారు. బండ్లగూడ జాగీర్‌మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం ఉదయం సమయంలో వివిధ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ అకాడమీ నుండి టిప్పుకాన్ బ్రిడ్జి వరకు రోడ్డును పరిశీలించి, ఎక్కడ నీరు నిలిచినా వెంటనే చర్యలు చేపట్టి వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని తెలిపారు. అలాగే 13,14,16 డివిజన్లలో చెత్త సేకరణను పరిశీలించి 100 శాతం చెత్తను సేకరించాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ నరేష్, జవాన్లు రామంజులు, వెంకటేష్, మల్లేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- కార్పొరేటర్ మోండ్ర సంగీత

అత్తాపూర్: డ్రైవర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద వ్యక్తి ఇల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా కుప్పకూలడంతో లబోదిబోమని విలపిస్తున్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్ పక్కనే జగన్ ఇల్లు ఉంది. గురువారం ఉదయమే అతను పని మీద బయటకు వెళ్లి వచ్చేసరికి పూర్తిగా ఇల్లు కూలిపోవడంతో కన్నీరు మున్నీరై విలపించారు. అక్కడే ఉన్న స్థానికులు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆమె కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారులతో చర్చించి నిరుపేద కుటంబానికి వెంటనే ఇల్లు నిర్మించేందుకు తగిన ఆర్థిక సహాయం చేయాలని కోరుతామన్నారు. ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండవద్దు అని సూచించారు. కురుస్తున్న వర్షాలకు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలన్నారు.



హైదర్‌గూడలో వర్షానికి కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్



కేబీ దొడ్డి వద్ద పొంగి పొర్లుతున్న ఈసీ వాగు



నాలా వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు

రాజేంద్రనగర్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు కాలనీలు, బస్తీలలో నీటి నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ కమీషనర్ కె.రవికుమార్ తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా నుంచి హసన్‌నగర్ వైపు వెళ్లే రహదారిలో రాందేవ్‌బాబా గుడి సమీపంలో వరద నీరు భారీగా రావడంతో డీఈ శంకర్, అసిస్టెంట్ ఇంజనీర్ నాగిరెడ్డి, సిబ్బందితో కలిసి పనులు చేపట్టారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో భారీ వరద నీటి రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో పపర్యటించి ప్రేత్యక చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.



వరద నీరు నిలిచిపోవడంతో సమస్యలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమీషనర్ రవికుమార్

జాతీయ విద్యావిధానంతో నైపుణ్యం పెంపుదల



జాతీయ విద్యా విధానం ప్రగతిపై మాట్లాడుతున్న గోపాలకృష్ణ

- ఎన్‌వీఎస్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

గచ్చిబౌలి: జాతీయ విద్యా విధానంతో విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెరిగాయని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని నవోదయ విద్యా సమితిలో 'జాతీయ విద్యా విధానం-2020' ప్రగతిపై నవోదయ సమితి, కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గోపాలకృష్ణ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)-2020 దిక్సూచిగా మారిందన్నారు. సాంకేతిక వినియోగంతో కళ, బొమ్మ, క్రీడల ఆధారిత బోధన, అనుభవ పూర్వకమైన అభ్యాసంతో విద్యార్థులలో నైపుణ్యాలు పెరుగుతున్నాయన్నారు.బెంగళూర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 240 మంది విద్యార్థులకు గానూ 225 మంది ఐఐటీకి వెళ్లారని తెలిపారు. ఎన్ఈపీని అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ ఇస్తున్నామని, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమన్నారు. జెఎన్‌వీ అసిస్టెంట్ కమిషనర్ అభిజిత్ బెహరా మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్‌లో అనేక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెఎన్‌వీ డీసీ జగదీశ్వరచారీ, అసిస్టెంట్ కమిషనర్ శాంతి, గచ్చిబౌలి కేవీఎస్ ప్రిన్సిపాల్ జితేంద్ర కుమార్, నవోదయ రంగారెడ్డి ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, కేవీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ మిత్రవింద తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు ఈరమ్మకు నివాళి

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఈరమ్మ స్వర్గస్థులైన సందర్భంగా గురువారం ఆమె పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, రజినీకాంత్, ఇమామ్, రూప పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మద్యంతాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు

మణికొండ: అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రాజేంద్రనగర్ కోర్టు జైలు శిక్ష విధించింది. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలకు ప్రకారం...నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో అతిగా మద్యం తాగి పట్టు పడిన వారిని గురువారం కోర్టులో హాజరుపరిచామన్నారు. వారిలో రవీందర్ నాయక్‌కు రూ.3,500 జరిమానతో పాటు 4రోజులు, వెంకటయ్యకు రూ.3,500 జరిమానాతో పాటు 3రోజులు, నవీన్‌కు రూ.4వేల జరిమానాతో పాటు 5రోజుల జైలు శిక్ష విధించారని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు రోడ్లపై డ్రంక్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఆయన కోరారు.

11 మందికి జైలు శిక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన 11 మందికి జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి పట్టుబడిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దైన తరువాత కూడా వాహనాలు నడిపిన వారికి వాహనాలు ఇచ్చిన వాహనాదారులుపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.బోస్‌కిరణ్ 13 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేసి వారిని కోర్టులో హజరుపరిచారు. 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ సజీరుద్దీన్ షా ముందు 13 మంది ప్రతివాదులను హజరుపరచగా వారిలో 11 మంది ప్రతివాదులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. అందులో ఒకరికి ఐదు రోజులు, ఒకరికి నాలుగు రోజులు, ఏడుగురికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అదే విధంగా మిగిలిన వారికిజరిమానా విధించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని బొల్లారం ఎక్స్ రోడ్డు వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పక్కన ఓ వ్యక్తి (40-45) పడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు బుధవారం రాత్రి 10 గంటలకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. స్థానికులను ఆరా తీయగా యాచకుడుగా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో తిరుగుతూ మద్యం తాగుతూ ఉండేవాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాతబస్తీలో అందుబాటులో లేని మినీ బస్సులు



మినీ బస్సు ఎక్కుతున్న ప్రయాణీకులు(ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో మినీ బస్సులు కనుమరుగయ్యాయి. ఒకప్పుడున్న రూట్‌లలో ప్రస్తుతం మినీ ఆర్టీసి బస్సుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. టిక్కెట్ల ద్వారా ఆదాయం లేదనే సాకుతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను అధికారులు తగ్గించారు. ఇంకా కొన్ని రూట్‌లలో పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా రూట్‌లలో ఆర్టీసీ ప్రయాణీకులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పాతబస్తీతో పాటు నగరంలో తిరగడానికి చార్మినార్ కట్టడం వద్ద కొత్త మినీ బస్సుల ప్రారంభోత్సవాన్ని పెద్ద ఎత్తున జెండా ఊపి ప్రారంభించారు. కొన్ని రోజుల పాటు పాతబస్తీలోని అంతర్గత రోడ్లలతో సైతం మినీ బస్సులు నడిచాయి. ఎంతో మంది స్కూలు విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులకు ఈ మినీ బస్సులు సౌకర్యంగా మారాయి. రానురాను వీటి ట్రిప్పులను తగ్గించిన అధికారులు ప్రస్తుతం పూర్తిగా రద్దు చేయడంతో పాతబస్తీలో కనిపించకుండా పోయాయి.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బస్ బాడీ వద్ద మయూరీనగర్ నుండి వచ్చే నాలా అవుట్ లెట్‌ను, డోవా కాలనీలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ శివప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మియాపూర్ డోవా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ, అధికారులు